



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
4PM
www.suryaa.com పేజీలు: 02


బంగారం ధర ₹63,270 10 GRMS 24 CARAT
వెండి ధర 1KG 78,000
సెన్సెక్స్ 72,568 (847)
నిఫ్టి 21,895 (247)
చికెన్ ధర 1KG ₹160
గుడ్ల ధరలు డజన్ ₹68

## జైన సన్యాసినిగా 19 ఏళ్ల యువతి



చిత్తూరు జిల్లాకు చెందిన 19 ఏళ్ల యువతి జైన సన్యాసినిగా మారుతున్నారు. జీవితంలో అన్ని కోరికలు, అనుబంధాలు త్యజించి సన్యాసినిగా ఉండేందుకు నిర్ణయించుకున్నట్లు యోగితాజీ సురానా మీడియా సమావేశంలో ప్రకటించారు. ఆమె తన తల్లిదండ్రులు, జైన సామాజికవర్గ పెద్దలతో కలిసి మాట్లాడి.. ఈనెల 16న సన్యాసినిగా మారుతున్నట్లు వెల్లడించారు.

# సైంధవ్ రివ్యూ



విక్టరీ వెంకటేష్ హీరోగా శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్ గా దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ "సైంధవ్". భారీ అంచనాల నడుమ ఈ సినిమా ఈరోజు థియేటర్లలో విడుదలైంది. ఈ చిత్రం ఎలా ఉందో సమీక్ష లోకి వెళ్లి చూద్దాం.

కథ: సైంధవ్ కోనేరు అలియాస్ సైకో (వెంకటేష్) తన కూతురు గాయత్రి (సారా)తో హ్యాపీగా లైఫ్ లీడ్ చేస్తుంటాడు. వారి ఇంటి పక్కన ఉండే మనోజ్ఞ (శ్రద్ధ శ్రీనాథ్) పాపని చూసుకుంటుంది. అయితే, గతంలో సైంధవ్ కోనేరు చేసిన క్రైమ్ కారణంగా, కార్టెల్ లో అతని పేరు వింటేనే భయపడిపోతారు. అలాంటి గతం ఉన్న సైంధవ్ కోనేరు అన్ని వదిలేసి కూతురి కోసం బతుకుతుంటాడు. కానీ, గాయత్రికి స్పైనల్ మాస్క్యులర్ ఎంట్రోపీ అనే వ్యాధి వస్తోంది. ఆ వ్యాధి నుంచి పాప బయట పడాలంటే రూ.17 కోట్ల విలువ కలిగిన వైల్ కావాలి. ఆ డబ్బుకోసం సైంధవ్ ఏం చేశాడు ?, తన పాపని రక్షించుకున్నాడా ?, లేదా ?, ఈ క్రమంలో వికాస్ మాలిక్ (నవాజుద్దీన్) తో వచ్చిన గొడవ ఏమిటి ?, చివరకు సైంధవ్ కోనేరు తన కూతురు కోసం ఏం సాధించాడు ?, ఈ మధ్యలో డా. రేణు (రుహాని శర్మ), జాస్మిన్ (ఆండ్రియా జెరెమియా) పాత్రలు ఏమిటి ? అనేది మిగిలిన కథ.

ప్లస్ పాయింట్స్: సైంధవ్ కోనేరు అనే సైకో పాత్రలో వెంకటేష్ చాలా పవర్ ఫుల్ గా కనిపించాడు. వైల్డ్ యాక్షన్ ఎలిమెంట్స్ తో పాటు ఎమోషన్స్ తోనూ వెంకటేష్ మెప్పించారు. ముఖ్యంగా తన పాత్ర పరిస్థితులకు తగ్గట్టు వేరియేషన్స్ చూపిస్తూ.. వెంకటేష్ నటించిన విధానం ఆకట్టుకుంది. పైగా తన బాడీ లాంగ్వేజ్ తో అలాగే, కొన్ని యాక్షన్ అండ్ ఎమోషనల్ సీక్వెన్స్ స్ లో మరియు తన స్టైలిష్ లుక్స్ తో వెంకటేష్ చాలా బాగా నటించాడు. అతిథి పాత్రలో నటించిన ఆర్య కూడా మెప్పించాడు. మరో కీలక పాత్రలో నటించిన శ్రద్ధా శ్రీనాథ్ కూడా చాలా బాగా నటించింది. జాస్మిన్ పాత్రలో ఆండ్రియా జెరెమియా ఒదిగిపోయింది. డా. రేణుగా రుహాని శర్మ నటన కూడా బాగుంది. జిషు సేన్‌గుప్తా, ముఖేష్ రిషి, జయప్రకాష్ లతో పాటు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రల పరిధి మేరకు బాగా నటించారు. ప్రతి ఒక్కరు తమ పాత్రలో ఒదిగిపోయారు. దర్శకుడు శైలేష్ కొలను రాసుకున్న యాక్షన్ సీన్స్ కొన్ని బాగున్నాయి.

మైనస్ పాయింట్స్: సినిమాలో ప్రధాన కథాంశం, సైంధవ్ పాత్ర, కథా నేపథ్యం, అలాగే ఇతర పాత్రల చిత్రీకరణ, నటీనటుల పనితీరు బాగున్నా.. కథనం విషయంలో మాత్రం దర్శకుడు నిరాశ పరిచాడు. అయితే, సెకెండ్ హాఫ్ లో పాత్రల మధ్య ఎమోషన్స్ ను బాగా ఎస్టాబ్లిష్ చేసినా... కొన్ని చోట్ల మెలో డ్రామాలా అనిపిస్తోంది. దీనికి తోడు సినిమాలో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ మిస్ అయ్యాయి. పాప కోసం సైంధవ్ చేసిన పోరాటంలో ఎమోషన్ ఉన్నా, ట్రీట్మెంట్ లో సరైన కాన్ ఫ్లిక్ట్ మాత్రం బిల్డ్ అవ్వలేదు. ప్రధానంగా కొన్ని లీడ్ సన్నివేశాల్లో గ్రిప్పింగ్ నరేషన్ మిస్ అయింది. దీనికితోడు, కొన్ని ఎమోషనల్ సన్నివేశాలు కూడా రొటీన్ గానే సాగాయి. విలన్స్ – హీరో మధ్య వార్ కి లీడ్ ఇంకా బలంగా ఉండాల్సింది. మొత్తమ్మీద దర్శకుడు శైలేష్ పూర్తి స్థాయిలో ఆకట్టుకునే విధంగా ఈ సినిమాను మలచలేక పోయారు. ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహాని శర్మ, ఆండ్రియా జెరెమియా వంటి మంచి నటీనటులు ఉన్నా.. వారికి తగ్గట్టు వారి పాత్రలను సరిగ్గా డిజైన్ చేయలేదు.

సాంకేతిక విభాగం: సాంకేతిక నిపుణుల గురించి మాట్లాడుకుంటే.. ముందే చెప్పకున్నట్లు దర్శకుడు శైలేష్ కొలను టేకింగ్ బాగుంది. అయితే, మంచి స్క్రీన్ ప్లే రాసుకోవడంలో విఫలం అయ్యారు. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ అందించిన సంగీతం పర్వాలేదు. ఐతే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మాత్రం కొన్ని కీలక సన్నివేశాల్లో ఇంకా బెటర్ గా ఉండి ఉంటే బాగుండేది. ఎస్ మణికందన్ సినిమాటోగ్రఫీ వర్క్ చాలా బాగుంది. ఇక ఎడిటర్ ఎడిటింగ్ వర్క్ కూడా పర్వాలేదు. నిర్మాత వెంకట్ బోయనపల్లి పాటించిన నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి.

తీర్పు: 'సైంధవ్' అంటూ వచ్చిన ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎమోషనల్ డ్రామా కొన్ని చోట్ల బాగానే ఆకట్టుకుంది. అలాగే, వెంకటేష్ గ్రేస్ అండ్ ఇమేజ్ సినిమాకి ప్లస్ అయ్యింది. కానీ, స్క్రీన్ ప్లేలో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ మిస్ కావడం, కొన్ని చోట్ల స్లో నేరేషన్, మరియు బోరింగ్ సీన్స్ వంటి అంశాలు సినిమాకి మైనస్ అయ్యాయి. ఓవరాల్ గా ఈ సినిమాలో వెంకటేష్ నటన, కొన్ని యాక్షన్ ఎలిమెంట్స్ ఆకట్టుకున్నాయి. వెంకటేష్ ఫ్యాన్స్ చూడొచ్చు.





## సీఎం కేజ్రీవాల్‌కు నాలుగోసారి ఈడీ సమన్లు




ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా నాలుగోసారి సమన్లు జారీ చేసింది. జనవరి 18 విచారణకు హాజరు కావాలని ఈడీ సమన్లలో పేర్కొంది. జనవరి 3న మూడోసారి ఈడీ ఇచ్చిన సమన్ల విచారణకు సీఎం కేజ్రీవాల్ డుమ్మా కొట్టిన విషయం తెలిసిందే. అయితే ఈడీ పంపిన సమన్లు చట్టపరమైనవి కావని, కేవలం తనను అరెస్ట్ చేయడమే లక్ష్యంగా జారీ చేసినవి కేజ్రీవాల్ మండిపడ్డ విషయం తెలిసిందే. ఇక గతంలో ఈడీ నవంబర్2, డిసెంబర్ 21న సీఎం కేజ్రీవాల్‌కు.. రెండుసార్లు సమన్లు పంపించిన విషయం తెలిసిందే. ఢిల్లీ లిక్కర్ స్కాంకి సంబంధించి మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోదియా 2023 ఫిబ్రవరి నుంచి జైల్లోనే ఉన్నారు. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌ను అక్టోబర్‌లో ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇక.. ఈసారైనా సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఈడీ సమన్లకు స్పందించి విచారణ వెళ్లుతారో? లేదో? అని ఆప్ పార్టీలో చర్చజరుగుతోంది.

## మౌనీ రాయ్ థైస్ షో

బాలీవుడ్ నటి మౌనీ రాయ్ సోషల్ మీడియాలో మంటలు రేపుతోంది. డేరింగ్ గా ఫొటోషూట్లు చేస్తూ మతులు పోగొడుతోంది. తాజాగా పంచుకున్న ఫొటోలతో నెటిజన్లను తనవైపు తిప్పుకుంటోంది. బాలీవుడ్ నటి మౌనీరాయ్ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్ గా ఉంటారో తెలిసిన విషయమే. గతేడాది పెళ్లి పీటలు ఎక్కిన ఈ ముద్దుగుమ్మ తన గురించిన అప్డేట్స్ ను ఎప్పటికప్పుడు అభిమాలనులతో పంచుకుంటూ వస్తోంది.తన సినిమాల కంటే.. వ్యక్తిగత విషయాలనే అభిమానులతో షేర్ చేసుకుంటూ వస్తున్న బాలీవుడ్ బ్యూటీ... తన ఫొటోషూట్లతోనూ అదరగొడుతోంది. స్టన్నింగ్ గా ఫొటోల ముందు ఫోజులిస్తూ మతులు పోగొడుతోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ పంచుకున్న ఫొటోలు నెటిజన్ల నోట మాట రాకుండా చేసింది. ఇప్పటికే మౌనీరాయ్ న్యూ ఈయర్ సెలబ్రేషన్ లో భర్తతో కలిసి, ఫ్రెండ్స్ తో కలిసి ఎంతలా ఎంజాయ్ చేసిందో తెలిసిందే. మరోవైపు బీచ్ లో బికినీలోనూ దర్శనమిచ్చి మైండ్ బ్లాక్ చేసింది.

## 3 కేసుల్లో నేడు సీఐడీ ఎదుట బాబు హాజరు



మూడు కేసుల్లో హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందిన టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం ఆ కేసుల దర్యాప్తు అధికారుల వద్దకు వచ్చి పూచీకత్తులు సమర్పించనున్నారు. బాబు హాయాంలో జరిగిన ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్), ఇసుక, మద్యం అక్రమాలపై కేసులు నమోదు చేయగా.. ఈ కేసుల్లో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన పూచీకత్తులను దర్యాప్తు అధికారులకు ఆయన సమర్పించాల్సి ఉంది. ఉ. 11 గంటలకు మద్యం కేసులో గుంటూరు సీఐడీ కార్యాలయానికి, ఇసుక కేసులో విజయవాడ సీఐడీ కార్యాలయానికి మధ్యాహ్నం 3.30 గంటలకు, ఐఆర్ఆర్ కేసులో సాయంత్రం 4.20 గంటలకు తాడేపల్లిలోని సిట్ కార్యాలయానికి వెళ్లి పూచీకత్తులు సమర్పించనున్నారు.

## బస్సులో చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం



బీచుపల్లి వద్ద ఘోర బస్సు ప్రమాదం జరిగింది. 10వ బెటాలియన్ సమీపంలో వాల్వో బస్సు బోల్తా పడింది. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. బస్సు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. మంటల్లో చిక్కుకుని మహిళ సజీవదహనం అయ్యింది.. 10 మందికి గాయపడ్డగా, వారిని ఆసుపత్రికి తరలించారు. బస్సు హైదరాబాద్ నుంచి కడప వెళ్తుండగా ఆ ఘటన చోటుచేసుకుంది. బస్సులో 34 మంది ఉన్నట్లు సమాచారం. ప్రయాణికులు అద్దాలగొట్టి బయటపడ్డారు.

## చంద్రబాబు ఇంటికి వైఎస్ షర్మిల..



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వైఎస్ షర్మిల నేడు కలవనున్నారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహానికి ఆహ్వానించనున్నారు. ఈ మేరకు తెలుగు రాజకీయాల్లో చంద్రబాబు-షర్మిల భేటీ చర్చనీయాంశంగా మారింది. గతంలో తన తండ్రికి రాజకీయ ప్రత్యర్థిగా ఉంటూ, తన అన్న కోసం ప్రచారం చేసిన సమయంలోనూ టార్గెట్ గా ఉన్న చంద్రబాబును ఇవాళ కాంగ్రెస్ నేత వైఎస్ షర్మిల కలవబోతుండటం సర్వత్రా ఉత్కంఠగా మారింది.చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్ నూ ఆహ్వానించనున్నారు. ఏపీ సీఎం జగన్ తో విభేదించి తెలంగాణలో వైఎస్సార్టీపీ స్థాపించిన తర్వాత వైఎస్ షర్మిల తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేస్తూ.. ఆ పార్టీలో చేరిన విషయం తెలిసిందే.



## మళ్లీ ఓడిన టైటాన్స్.. పదకొండో పరాజయం

ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. జైపూర్ పింక్ పాంథర్స్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 35-38తో పోరాడి ఓడిపోయింది. ఈ లీగ్‌లో టైటాన్స్‌కిది 11వ ఓటమి కావడం గమనార్హం. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ 12 పాయింట్లు స్కోరు చేయగా... సందీప్ ధుల్, రాబిన్ 5 పాయింట్ల చొప్పున సాధించారు. జైపూర్ తరఫున అర్జున్ దేశ్వాల్ అత్యధికంగా 14 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 37-17తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. పుణేరి పల్టన్ కెప్టెన్ అస్లమ్ ముస్తఫా 10 పాయింట్లు సాధించాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో పుణేరి పల్టన్; యూపీ యోధాస్‌తో బెంగాల్ వారియర్స్ తలపడతాయి.

## ఉత్తర కొరియాపై నిఘా కోసం ఉపగ్రహాన్ని ప్రయోగించిన జపాన్



ఉత్తర కొరియాపై నిఘా వేసేందుకు జపాన్ కీలక ముందడుగు వేసింది. శుక్రవారం ఒక నిఘా ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇది ఉత్తర కొరియా దళాల కదలికలను పసిగట్టనుంది. అలాగే వాతావరణంలో ముప్పులను ముందస్తుగా గ్రహించి అప్రమత్తం చేస్తుంది. తనేగషిమా అంతరిక్ష కేంద్రం నుంచి హెచ్2ఏ రాకెట్ ద్వారా దీన్ని ప్రయోగించారు. ఈ ఉపగ్రహం స్పష్టమైన చిత్రాలను తీయగలదు. 1988లో ఉత్తర కొరియా క్షిపణి జపాన్ గగనతలం పైనుంచి దూసుకెళ్లింది. నాటి నుంచి సొంతంగా నిఘా ఉపగ్రహ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు జపాన్ చర్యలు చేపట్టింది. 10 ఉపగ్రహాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకొంది. క్షిపణి ప్రయోగాలను ఈ నెట్‌వర్క్ సాయంతో వేగంగా గుర్తించే అవకాశం జపాన్‌కు లభిస్తుంది. మరోవైపు అంతరిక్ష ప్రయోగాలను మరింత వేగవంతం చేసేందుకు హెచ్3 రాకెట్‌ను కూడా అభివృద్ధి చేస్తోంది.

# తైవాన్‌ను స్వాధీనం చేసుకునేందుకు చైనా దాడులు

చైనాకు ద్వీపదేశంగా ఉన్న తైవాన్‌పై యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. తైవాన్‌లో ఇవాళ జరుగనున్న ఎన్నికల్లో వెలువడే ఫలితాల ఆధారంగా ఆ దేశ భవితవ్యం ఆధారపడి ఉంటుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. తైవాన్‌ను తన అధీనంలోకి తీసుకోవాలని డ్రాగన్ కంట్రీ భావిస్తుంది. దీంతో ఈ ద్వీప కల్పాన్ని అష్టదిగ్బంధనం చేసిన చైనా ఆ దేశ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను కూడా తమ అధీనంలోకి తీసుకున్నట్లు టాక్. ఇక, తైవాన్‌లోని బ్యాంకులు క్లోజ్ కాబోతున్నాయి. ప్రజలు కోట్ల రూపాయల లావాదేవీలను ఆఫ్‌లైన్‌లోనే వినియోగిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత అధునాతన సెమికండక్టర్ పరిశ్రమ తైవాన్‌లో ఉంది.. అది కూడా స్తంభించిపోయింది. చైనా ప్రత్యక్షంగా తన సేనలను పంపడం తప్ప మిగిలిన అన్ని విధాలుగా తైవాన్‌ను ఇబ్బందుల్లోకి నెట్టింది. డ్రాగన్ కంట్రీ ప్రత్యక్షంగా దాడికి దిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 828 లక్షల కోట్ల రూపాయల నష్టం జరుగుతుందని ఆర్థిక నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే, స్వయం ప్రతిపత్తి పాలనలో ఉన్న తైవాన్‌ను తమ భూభాగానికి సంబంధించినదిగా చైనా భావిస్తుంది. చైనా తమపై దాడి చేసిన రోజున కేవలం తమ రక్షణ వ్యవస్థకు, భద్రతా దళాలకు మాత్రమే నష్టం జరుగదు.. తైవాన్‌ను పూర్తిగా ఈ ప్రపంచం నుంచి వేరుచేయడానికి ట్రై చేస్తుందని ఆ దేశ సైబర్ నిపుణులు తెలిపారు. ఇప్పటికే తైవాన్ కంప్యూటర్ నెట్‌వర్క్‌పై ప్రతిరోజు లక్షల సంఖ్యలో సైబర్ దాడులు కొనసాగుతున్నాయని తైవాన్ జాతీయ రక్షణ, భద్రత పరిశోధన సంస్థ నిపుణుడు క్రిస్టల్ టు పేర్కొన్నారు. చైనా ఆక్రమణను ప్రకటించగానే వారు తమ టెలికమ్యూనికేషన్లను, ఇంధనం, ఆర్థిక రంగాలను స్తంభింపచేయగలరని తైవాన్ చెప్పింది. ఇక, సైబర్ నేరస్థులు తైవాన్ ప్రభుత్వ, రక్షణ సంస్థలనే కాకుండా అక్కడి సెమికండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను అవసరమైతే ధ్వంసం చేస్తాం తప్ప వాటిని చైనా దళాల చేతిలో పడనివ్వబోమని అమెరికాకు చెందిన ఓ అధికారి గత ఏడాది వెల్లడించారు. డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీకి చెందిన త్సాయి ఇంగ్-వెన్ తైవాన్ అధ్యక్షురాలిగా 2016లో ఎన్నికైయింది. అప్పటి నుంచే చైనా ఆ దేశంపై దౌత్యపరమైన, సైనికపరమైన ఒత్తిడిని స్టార్ట్ చేసింది. తైవాన్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకోవడంతో పాటు తమపై ఇతర దేశాల పెత్తనాన్ని నిరాకరించడం చైనాకు నచ్చలేదు.. దీంతో క్రమంగా తైవాన్‌కు ఇబ్బందులు సృష్టిస్తుంది. దీంతో ఏదో ఓ రోజున చైనా తైవాన్‌పై దురాక్రమణకు పాల్పడవచ్చన్న ఊహాగానాలు ప్రారంభమయ్యాయి. సైబర్ దాడులతో చైనా ఆగిపోదు, ప్రపంచంతో తైవాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టేందుకు



ట్రై చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, తైవాన్‌పై యుద్ధం జరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 10 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టం జరుగుతుందని బ్లూమ్‌బర్గ్ ఎకనామిక్స్ సంస్థ వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం వల్ల జరిగిన నష్టం కన్నా ఎక్కువ అని తెలిపింది. తైవాన్ ప్రజల్లో పెరుగుతున్న జాతీయవాద భావన, వాషింగ్టన్- బీజింగ్ మధ్య విచ్ఛిన్నమవుతున్న సంబంధాలు, పెరుగుతున్న చైనా ఆర్థిక, సైనిక శక్తిని బట్టి తైవాన్‌లో సంక్షోభం తప్పకపోవచ్చని నిపుణులు అంచనా తెలిపింది. చైనా దురాక్రమణకు పాల్పడితే.. తైవాన్‌లోని సెమికండక్టర్ల వ్యవస్థ కుప్పకూలుతుంది.. దీంతో ప్రపంచవ్యాప్తంగా ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్ల తయారీ స్తంభించిపోతుందని సమాచారం.



## పండగ సెలవుల్లో విషాదం.. గాలిపటం ఎగరేస్తూ బాలుడు మృతి

హైదరాబాద్ అత్తాపూర్ లో దారుణం జరిగింది. గాలిపటాలు ఎగరేస్తూ ఓ బాలుడు విద్యుత్ షాక్ కు గురయ్యాడు. తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పిల్లలు, పెద్దలు పతంగులు ఎగురేస్తున్నారు. ఈ క్రమంలో పతంగి విద్యుత్ తీగలకు చిక్కుకుని విద్యుదాఘాతానికి గురైంది. విషయం తెలియని బాలుడు.. గాలిపటాన్ని సరిచేసే క్రమంలో తానూ షాక్ కు గురయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో బాలుడి తల్లిదండ్రులు రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సంక్రాంతి అంటేనే రంగు రంగుల ముగ్గులు, పిండివంటలతో పాటు గాలిపటాలూ గుర్తుకువస్తాయి. పతంగులు ఎగరవేయాలనే మోజులో పడి కొందరు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. కాబట్టి పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకపోతే పండగ పూట తీవ్ర విషాదం తప్పదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.




## హైవేపై 'సంక్రాంతి' రద్దీ.. కిక్కిరిసిన వాహనాలు

హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు కిక్కిరిసిపోయాయి. హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు పండుగ కోసం స్వస్థలాలకు వెళ్తున్న క్రమంలో ఈ రద్దీ ఏర్పడింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వాహనాల రద్దీ పెరిగిపోయింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద గురువారం అర్ధరాత్రి 12 నుంచి శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు 53 వేల వాహనాల రాకపోకలు సాగించాయి. గతేడాది రోజంతా(24 గంటలు) కలిపి అరవై వేల వాహనాలు మాత్రమే ప్రయాణించగా.. ఈ ఏడాది కేవలం 18 గంటల్లోనే 50వేలకుపైగా వాహనాలు వెళ్లడం గమనార్హం. సంక్రాంతికి భారీగా సొంతూళ్లకు జనాలు వెళ్తున్నారు. పంతంగి టోల్ ఫ్లాజా వద్ద వాహనాల రద్దీ కొనసాగుతున్నారు. పంతంగి టోల్ ఫ్లాజా వద్ద హైదరాబాద్- విజయవాడ వైపు పది టోల్ బూత్‌లను జీఎంఆర్ ఓపెన్ చేసింది. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్ల పహాడ్ వద్ద రద్దీ కొనసాగుతోంది. కొర్లపహాడ్ వద్ద ఎనిమిది టోల్ బూత్‌లను సిబ్బంది తెరిచారు. తెలుగు రాష్ట్రాల్లో బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. తిరుపతి, విజయవాడ,విశాఖపట్నం బస్‌స్టేషన్లల్లో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. రద్దీ కారణంగా ఏపీఎస్ఆర్టీసీ స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసింది. అదనపు చార్జీలు లేకుండానే సర్వీసులను నడుపుతున్నారు.



## భార్య ఆత్మహత్య.. భర్తను కొట్టిచంపిన బంధువులు!

నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం చెన్నంపల్లిలో దారుణం చోటుచేసుకుంది. వివాహిత మృతి ఘటనలో భర్తను మృతురాలి బంధువులు చంపారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా ఉంటున్న సింధు, నాగార్జున మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని సింధు ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే బంధువులు అమెను నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఆమె మృతి చెందింది. మృతదేహంతో బంధువులు అచ్చంపేటకు తిరుగుపయనమయ్యారు. ఆమె మృతికి భర్తే కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. శుక్రవారం అర్ధరాత్రి ఆమనగల్లు వద్ద నాగార్జునను సింధు బంధువులు కొట్టిచంపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## హాట్ ఫోజులతో రచ్చ చేస్తున్న దిశా పటాని

'లోఫర్' సినిమాతో టాలీవుడ్‌లోకి అరంగేట్రం ఇచ్చింది దిశా పటానీ. టైగర్ ష్రాఫ్ గర్ల్‌ఫ్రెండ్‌గా సోషల్ మీడియాలో తరచూ హాట్ టాపిక్‌గా నిలిచిన ఈ బ్యూటీ.. ప్రస్తుతం సూర్య సరసన 'కనగువ' చిత్రంలో నటిస్తోంది. లోఫర్'లో కనిపించిన ఆ సూపర్ సుందరాంగిని తెలుగు ప్రేక్షకులు ఇంకా మరిచిపోలేదు. ఆ కళ్లకు కనికట్టు తెలుసు. ఆ చూపులకు ఇంద్రజాలం వచ్చు. కాబట్టే, బాలీవుడ్ ఆ బంగారు బొమ్మను ఎగరేసుకుపోయింది. అయితేనేం, తను నాగ్ అశ్విన్ 'ప్రాజెక్ట్ కే'లో ప్రభాస్ పక్కన అవకాశం దక్కించుకుంది. అన్నీ కుదిరిదే.. వచ్చే సంక్రాంతికి దిశా పఠానీని తెలుగు తెరపై చూడబోతున్నాం. పెళ్లి అంటారా.. జరగాల్సిన సమయంలో తప్పక జరిగిపోతుంది. ప్రస్తుతానికి ఆ ఆలోచనల్లేవు. పెళ్లి తర్వాత నటిస్తారా? అని కూడా అడుగుతారుగా మీరు. అడగండి. నా దగ్గర జవాబు సిద్ధంగా ఉంది. ఒకరి భార్య కావడం అనేది నా జీవితంలో సగ భాగమే. నాకంటూ కలలు ఉన్నాయి. సాధించాల్సిన లక్ష్యాలున్నాయి. అవన్నీ నా జీవితంలో మిగతా సగం.

## దిశ నాయక్.. దేశంలోనే తొలి మహిళా ఎయిర్‌పోర్ట్ ఫైర్ ఫైటర్

మహిళలు అన్ని రంగాల్లో అడుగు పెడుతున్నారు. పురుషులతో తాము ఏమాత్రం తీసిపోమని నిరూపించు కుంటున్నారు. కొన్ని ఉద్యోగాల్లో మాత్రం వారి ఉనికే కనిపించడం లేదు. 'ఎయిర్‌పోర్ట్ ఫైర్ ఫైటర్' అలాంటి కొలువే. గోవాకు చెందిన దిశ నాయక్ ఆ లోటు తీర్చారు. దిశకు మొదటినుంచీ తను ఏ దిశన వెళ్లాలనే స్పష్టత ఉంది. విమానయాన రంగం అంటే ఇష్టం. అందులోనూ విమానాల్లో అగ్ని ప్రమాద నివారణ పట్ల ప్రత్యేక ఆసక్తి. ఇదేమంత తేలికైన విషయం కాదు. మానసికంగా, శారీరకంగా ఎంతో ఒత్తిడికి గురిచేసే శిక్షణ ఉంటుంది. ఆరునెలలపాటు ఆ శిక్షణలో రాటుదేలారు. తానేమిటో నిరూపించుకున్నారు దిశ. సాధారణంగా ల్యాండింగ్, టేకాఫ్ సమయాల్లో అగ్ని



ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాంటి సమయంలో మంటలను ఆర్పడమే కాకుండా, అందులోని ప్రయాణికులను కాపాడాలి. ఇందుకు చాలా తెగువ అవసరం. ప్రాణ రక్షణ నైపుణ్యాలను అందిపుచ్చుకున్న తర్వాత, గోవా విమానాశ్రయంలో అడుగుపెట్టి.. దేశంలోనే తొలి మహిళా ఎయిర్‌పోర్ట్ ఫైర్ ఫైటర్‌గా చరిత్ర సృష్టించారు దిశ నాయక్. 'ఈ కొలువులో ఎంతో సంతృప్తి ఉంది' అంటారామె ఆత్మవిశ్వాసంతో.

## 'వ్యూహం'ను ఓటీటీలోనూ విడుదల చేయొద్దు



వ్యూహం సినిమాను ఓటీటీ, ఆన్‌లైన్, ఇంటర్నెట్ వేదికల్లోనూ విడుదల చేయొద్దని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు శుక్రవారం ఆదేశించింది. సినిమా విడుదలను ఆపాలంటూ తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ డిసెంబరులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. సినిమాలో అభ్యంతరకర సన్నివేశాలున్నాయని, చంద్రబాబును అపఖ్యాతిపాలు చేసే విధంగా చిత్రీకరించారని పిటిషన్‌లో లోకేశ్ పేర్కొన్నారు.



## ఒక్క టెస్టుతో 18 రకాల క్యాన్సర్ లను గుర్తించొచ్చు

ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధిని గుర్తించడంలో శాస్త్రవేత్తలు మరో ముందడుగు వేశారు. 18 రకాల క్యాన్సర్‌లను ప్రారంభ దశలోనే గుర్తించే కొత్త డీఎన్ఎ పరీక్షను అభివృద్ధి చేశారు. ఇది వైద్య చరిత్రలో గొప్ప విప్లవంగా వైద్య నిపుణులు తెలిపారు. పురుషులలో 93% శాతం, మహిళల్లో 84% శాతం క్యాన్సర్లను గుర్తించడం జరిగిందని, ఆ పరీక్షల్లో 99% కచ్చితమైన ఫలితాలు వెలువడ్డాయని శాస్త్రవేత్తలు బీఎంజే ఆంకాలజీ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు.



## తొలి రెండు టెస్టుల కోసం జురెల్‌కు చోటు

### ఇంగ్లండ్‌తో టెస్టులకు ఎంపిక

యంగ్ క్రికెటర్ ధ్రువ్ జురెల్‌కు టీమిండియా నుంచి పిలుపు వచ్చింది. ఇంగ్లండ్‌తో ఈ నెల 25 నుంచి జరిగే ఐదు టెస్టుల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు ఆలిండియా సీనియర్ సెలెక్షన్ కమిటీ శుక్రవారం టీమ్‌ను ప్రకటించింది. రోహిత్ కెప్టెన్సీలోని జట్టులో కొత్తగా 22 ఏండ్ల వికెట్ కీపర్ జురెల్‌కు చాన్స్ ఇచ్చింది. వైట్ బాల్ ఫార్మాట్‌లో ఆడుతున్న పేసర్ అవేశ్ ఖాన్‌ను టెస్టు టీమ్‌లోకి తీసుకుంది. ఏడాది గ్యాప్ తర్వాత చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా రెడ్ బాల్ ఫార్మాట్‌లోకి వచ్చాడు. ఏపీ కీపర్ కేఎస్ భరత్ తిరిగి నేషనల్ టీమ్‌లోకి రీఎంట్రీ ఇచ్చాడు. రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో డబుల్ సెంచరీతో అదరగొట్టిన సీనియర్ బ్యాటర్ చతేశ్వర్ పుజారాను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు. గాయం నుంచి కోలుకుంటున్న సీనియర్ పేసర్ మహ్మద్ షమీ కూడా టీమ్‌కు దూరంగా ఉన్నాడు. తొలి టెస్టు ఈ నెల 25 నుంచి హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరుగుతుంది. ఫిబ్రవరి 2 నుంచి జరిగే రెండో మ్యాచ్‌కు వైజాగ్ ఆతిథ్యం ఇస్తుంది.

తొలి రెండు టెస్టులకు టీమ్: రోహిత్ (కెప్టెన్), గిల్,యశస్వి జైస్వాల్, కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (కీపర్), భరత్ (కీపర్), ధృవ్ జురెల్ (కీపర్), అశ్విన్, జడేజా, అక్షర్, కుల్దీప్ యాదవ్, సిరాజ్, ముకేష్ కుమార్, బుమ్రా (వైస్ కెప్టెన్ ), అవేష్ ఖాన్